సాక్షి రంగారెడ్డి
శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



సంక్షేమమే లక్ష్యం

నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు

ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ పరీక్షలు విధిగా నిర్వహించాలని ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్ సూచించారు. 8లో▸



పక్కాగా అమలుచేస్తాం

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

ఆక్సిటోసిన్ ఇంజక్షన్ల పట్టివేత

ఇబ్రహీంపట్నం: నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠాను ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. గేదెలు అధికంగా పాలు ఇవ్వడానికి అనుమతి లేని నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్లను ఇంతియాజ్ అనే వ్యక్తి తీసుకొచ్చి నాదర్‌గుల్ సమీపంలో రైతులు మహేందర్‌రెడ్డి, దినేశ్‌కు విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో 210 ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్



విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఎస్‌ఈ కరుణాకర్‌బాబు

హుడాకాంప్లెక్స్: వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందజేయాలని సరూర్‌నగర్ ఎస్‌ఈ పి.కరుణాకర్‌బాబు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఎల్‌బీనగర్ సబ్ డివిజన్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు అధికారులు, సిబ్బంది తప్పనిసరి వారి పరిధిలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించాలన్నారు. వేసవిలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తమ లక్ష్యమన్నారు. ఎంత డిమాండ్ పెరిగినా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ పరంగా ఏమైనా సమస్యలుంటే కంట్రోల్ రూంకు 79016 79895 నంబర్‌లో ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం: వేసవిలో విద్యుత్ సంక్షోభం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సరూర్‌నగర్ ఎస్‌ఈ కరుణాకర్‌బాబు ఆదేశించారు. ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బందితో స్థానిక భారత్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 గంటలు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ అంతరాయం కలిగిన వెంటనే స్పందించాలని లేకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కరెంట్ సరఫరాలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఏఈలపై ఉందన్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల పీక్ లోడ్ అవర్స్‌లో వారి ఎఫ్‌ఓసీ పరిధిలో పంపిణీని పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఈ యాదగిరి, ఏడీఈ సైదులు, స్థానిక ఏఈ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా అమలు చేయలేరు!

ఈటల రాజేందర్

లింగోజిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు అమలు చేయడం అసాధ్యమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్‌లోని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధిష్టానం ఆదేశిస్తే మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీవీఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, క్లాం నవ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ 'గ్యారంటీ'



చేవెళ్లలోని ఫరా కళాశాల వద్ద సభకు సంబంధించి ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక తదితరులు

ఆనవాయితీ కొనసాగిస్తోన్న కాంగ్రెస్ పార్టీ

- చేవెళ్ల నుంచే మరో రెండు పథకాలకు శ్రీకారం
- రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఈనెల 27న భారీ బహిరంగ సభకు సన్నాహాలు

సాక్షి రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల సెంటిమెంట్‌ను కొనసాగిస్తోంది. డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో అమలు చేసిన ప్రతి సంక్షేమ పథకాన్ని సెంటిమెంట్‌గా చేవెళ్ల నుంచే మొదలుపెట్టిన విషయం తెలిసిందే. అదే సెంటిమెంట్‌ను పార్టీ కొనసాగిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో 'ఎస్సీ డిక్లరేషన్' సభ సైతం ఇక్కడే నిర్వహించింది. తాజాగా పార్టీ ప్రకటించిన మరో రెండు పథకాలను కూడా ఇక్కడి నుంచే లాంఛనంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 27న ప్రకటించిన రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గ్యారంటీలను పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా చేవెళ్లలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి, ప్రజలందరి సమక్షంలో రెండు పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు సభ ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కలెక్టర్ శశాంక, ఇతర అధికారులు పరిశీలించారు.

గ్రేటర్ పరిధిలో ఇలా..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తుండగా.. ఈ నెల 27 నుంచి రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించనున్నారు. గ్రేటర్ పరిధిలో 9 సర్కిళ్లు ఉండగా వీటిలో 48,03,963 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 200 యూనిట్ల లోపు వినియోగించే వారి సంఖ్య 19.80 లక్షలుగా ఉన్నట్లు అంచనా. ఇప్పటికే వీరంతా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని 17.21 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డులు అందరికీ లేకపోవడంతో ఉచిత పథకానికి అనుసంధానం చేసుకున్న వారి సంఖ్య 9,96,807గా ఉంది. మీటర్ రీడర్ల సమ్మె కారణంగా కొందరు నమోదు చేసుకోలేకపోయారు. ఇక అద్దె ఇళ్లలో నివసించే వారికి ఈ పథకం వర్తిస్తే న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని ఇంటి యజమానులు అభ్యంతరం తెలుపుతున్నారు.

సర్కిల్	గృహ విద్యుత్ కనెక్షన్లు	రేషన్, ఆధార్ లింక్ చేసినవి
బంజారాహిల్స్	3,12,684	56,298
సైబర్‌సిటీ	5,30,357	87,533
హబ్సిగూడ	7,30,963	1,51,517
సెంట్రల్ సర్కిల్	4,97,825	87,243
సౌత్ సర్కిల్	5,41,453	1,08,600
మేడ్చల్	7,07,909	1,41,322
రాజేంద్రనగర్	4,54,725	1,36,787
సరూర్‌నగర్	6,08,798	1,37,790
సికింద్రాబాద్	4,19,249	89,717
మొత్తం	48,03, 963	9,96,807

ఏర్పాట్ల పరిశీలన

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మరో రెండు పథకాలను (రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్) చేవెళ్ల వేదికగా లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ శశాంక, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ శ్రీలత, చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, ఏసీపీ బి.కిషన్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బహిరంగసభ కోసం చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌ను పరిశీలించారు. సభాస్థలం పక్కనే హెలిప్యాడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. సభకు వచ్చే వాహనాలకు సంబంధించి పార్కింగ్ ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించారు. ప్రభుత్వం చేవెళ్లలో సభ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైందని.. ఇందుకోసమే సభా స్థలాన్ని పరిశీలించినట్లు పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. అనంతరం కలెక్టర్ చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. చేవెళ్లలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఓ ఫాం హౌస్‌లో సమావేశమయ్యారు. కలెక్టర్, అధికారులు సూచించిన సభా స్థలం వివరాలతో మరోసారి ఉన్నతాధికారులు సైతం పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పి.వెంకటస్వామి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, విద్యుత్ ఏడీ స్వామి, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు ప్రాజెక్టుపై డ్రామాలు వద్దు

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

షాద్‌నగర్: పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదా పేరుతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చేస్తున్న డ్రామాలు మానుకోవాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెరలేపిందన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ కేంద్రంపై ఒకే రకమైన విమర్శలు చేస్తున్నారని అన్నారు. తాము పోరాటం చేయకుంటే పాలమూరు ప్రాజెక్టు ఎక్కడిదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆరెండు పార్టీల నేతలు ఓట్ల కోసం రాజకీయాలు చేయడం సరికాదన్నారు. డ్రామాలు మానుకొని పాలమూరు అభివృద్ధి కోసం పాటు పడాలని హితవుపలికారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే రేవంత్‌రెడ్డి బూరెల బుట్టలో పడ్డాడని, బుట్టలో గారెలు తింటూ కూర్చొవద్దని.. ప్రజల మంచి చెడ్డలు చూడాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కల అని అన్నారు. తెలంగాణలో అన్ని ఎంపీ స్థానాల్లో బీజేపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, నాగూరావు నామోజీ, శ్రీవర్ధన్ రెడ్డి, అందెబాబయ్య, పవన్‌కుమార్, రాజు, కక్కునూరి వెంకటేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి ఆప్షన్ పద్ధతే కరెక్ట్

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: గురుకుల పాఠశాల, ఇతర ఉద్యోగ పోస్టుల భర్తీలో రిలీం క్యాష్ పద్ధతి ప్రవేశపెట్టడంతో పాటు ఆప్షన్స్ ద్వారా నియామకాలు పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాలల్లో 12 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల ఫలితాలు కూడా ప్రకటించిందన్నారు. ఇందులో లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీ టీచర్స్, గ్రాడ్యుయేట్ టీచర్స్ పోస్టులు ఉన్నాయన్నారు. అయితే, సెలక్ట్ అయిన అభ్యర్థుల్లో సుమారు నాలుగు వేల మందికి ఈ నాలుగు పోస్టులే వచ్చాయని.. వారంతా లెక్చరర్స్ పోస్టులు ఎంపిక చేసుకోగా మిగిలినవి బ్యాక్‌లాగ్‌లుగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో ఏళ్లుగా ఆందోళనలు చేసి టీచర్స్ నోటిఫికేషన్ సాధించుకుంటే.. పోస్టులు పెద్ద ఎత్తున మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే రిలీం క్యాష్ ప్రవేశపెట్టి ఆప్షన్ పద్ధతి ద్వారా మిగతా పోస్టులను నింపాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేశ్, గుజ్జ కృష్ణ, సుధాకర్, నందగోపాల్, సి.రాజేందర్, అనంతయ్య, రామలింగం, రేగుల మధుసూదన్, అస్మా బేగం, ఉపేంద్ర, బాలరాజు, రాజేందర్, సుజాతలావణ్య, అలేఖ్య, లక్ష్మి, దీపిక తదితరులు పాల్గొన్నారు.



మల్లురవిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలుస్తాం

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి డా.మల్లురవి

ఆమనగల్లు: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అన్ని ఎంపీ సీట్లలో విజయం సాధిస్తుందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి డా.మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. కల్వకుర్తిలో జరిగే పార్టీ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న ఆయనకు ఆమనగల్లు పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మల్లురవి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లపాటు నియంత పాలన కొనసాగగా.. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతోందని చెప్పారు. ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా వంద రోజుల్లో అన్ని హామీలు అమలు చేసి తీరుతామని అన్నారు. ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేరుస్తామని, వారి సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తామని ఆయన వివరించారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తానని, పోటీకి పదవి అడ్డువస్తే వదులుకుంటానని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, రవీందర్‌నాయక్, మండ్లి రాములు, శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్, గాజుల శ్రీను, కాసోజు రాము, కుమార్‌గౌడ్, రాజశేఖర్, జంతుక యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీపై రెండు నాల్కల ధోరణి

- సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి స్పష్టం చేయాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



యాచారం: కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

యాచారం: ఫార్మాసిటీపై సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు విమర్శించారు. ఆ పార్టీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర శుక్రవారం మాల్, యాచారం, గునుగల్ కేంద్రాల్లో కొనసాగింది. యాచారంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం అయిన తర్వాత ఓసారి ఫార్మాసిటీ రద్దు చేస్తామని, ఆ వెంటనే మరికొన్ని రోజులకు రద్దు చేయట్లేదని పేర్కొనడంతో ప్రజల్లో అయోమయం నెలకొందని అన్నారు. ఫార్మాసిటీపై స్పష్టమైన వైఖరి ప్రకటించి ప్రజల్లో ఉన్న అనుమానాలు, భయాందోళనలు నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. నరేంద్రమోదీతోనే దేశ రక్షణ, దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. మూడోసారి మోదీని ప్రధానిగా చూడటానికి దేశ ప్రజలు నిర్ణయం తీసుకున్నారని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటువేసి వృథా చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ పైసా నిధులు మంజూరు చేయలేదని అన్నారు. కేంద్రం మంజూరు చేసిన ఈజీఎస్ నిధులతోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొరెడ్డి నర్సింహారెడ్డి, యాచారం మండల అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

ఇబ్రహీంపట్నం: మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విజయ సంకల్ప యాత్ర శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో దశాబ్దాల తరబడి పరిష్కారానికి నోచుకోని అయోధ్య రామమందిరం, 370 ఆర్టికల్ రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లులాంటి సమస్యలను మోదీ పరిష్కరించి చూపించారన్నారు. రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడే పలు పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నట్లు తెలిపారు. కుటుంబపాలన, అవినీతికి తావులేకుండా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి అధికారాన్ని కట్టబెట్టామని.. ఇప్పుడెందుకు కాంగ్రెస్‌ను గెలిపించామా అని ప్రజలు ఆలోచనలో పడ్డారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఖిల్లాపై బీజేపీ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషిచేయాలని పిలుపునిచ్చారు. భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం బాగుపడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీని మూడోసారి ప్రధానిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్కా రవీందర్‌రెడ్డి, పట్నం అసెంబ్లీ కన్వీనర్ యాదిగిరి రెడ్డి, పార్టీ నాయకులు బోసుపల్లి ప్రతాప్, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, గోగిరెడ్డి లచ్చిరెడ్డి, మర్పల్లి అంజయ్యయాదవ్, బూడిద నర్సింహారెడ్డి, దండే శ్రీశైలం, నారాయణ యాదవ్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆపరేటర్ హత్య

- డబ్బుల విషయంలో వివాదం
- రాళ్లు, కర్రలతో కొట్టి చంపిన దుండగులు
- ఆలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఘటన



హర్యానాయక్ (ఫైల్)

చేవెళ్ల: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆపరేటర్‌ను అతి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన హర్యానాయక్ (40) రెండేళ్లుగా ఆలూ రు సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే గురువారం రాత్రి కూడా విధి నిర్వహణలో ఉన్న అతను అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామానికి చెందిన ఎల్లకొండ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి కొంత మంది నేపాల్‌కు చెందిన వారు తనతో గొడవ పడుతున్నారని చెప్పాడు. శ్రీనివాస్ అక్కడికి వెళ్లి చూసేసరికి హర్యానాయక్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఏడీ, ఏఈ అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చేవెళ్ల మండల విద్యుత్ ఏఈ నయీమొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో..

ఆలూరు గ్రామంలోనే నేపాల్‌కు చెందిన వ్యక్తి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడిపిస్తున్నాడు. అతడికి పెయింటింగ్ పనులు చేసే కొంతమంది స్నేహితులు ఉన్నారు. నేపాల్‌కు చెందిన వ్యక్తికి హర్యానాయక్‌కు పరిచయం ఉండటంతో గురువారం రాత్రి స్నేహితులతో కలిసి సబ్‌స్టేషన్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వమని, రాత్రికి అక్కడే పడుకుంటామని గొడవకు దిగినట్లు సమాచారం. దీనికి ఆపరేటర్ నిరాకరించటంతో మద్యం మత్తులో రాళ్లు, కర్రలతో కొట్టి హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. హర్యానాయక్‌ను హత్యచేసి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తోపాటు ఆఫీస్ ఫోన్ కూడా ఎత్తుకెళ్లారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితులకోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మురుగు ముంచెత్తుతున్నా పట్టించుకోరా?

- గాంధీ ఆస్పత్రిలో అపరిశుభ్రతపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం

గాంధీ ఆస్పత్రి: గాంధీ ఆస్పత్రిలో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల లీకేజీ, భవన నిర్వహణపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ పైప్‌లైన్లు లీకై మురుగు ముంచెత్తుతున్నా ఇంజినీర్లు, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి గాంధీ ఆస్పత్రి రూపురేఖలు మార్చడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య మృతదేహానికి నివాళి అర్పించిన తర్వాత ఆస్పత్రి సూపరింటెండెంట్ పేషీకి చేరుకున్నారు. మార్చురీ నుంచి ప్రధాన భవనం వరకు నడుచుకుంటూ వెళ్తూ డ్రైనేజీ పైప్‌లైన్ల లీకేజీలను గమనించారు. సమస్యపై పక్కనే ఉన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావును అడిగి ఆరా తీశారు. ఏడాది క్రితం రూ.14.56 కోట్లు మంజూరు చేసి, ఆరుసార్లు టెండర్లు పిలిచినా ఏవరూ ముందుకు రాలేదని రాజారావు తెలిపారు.

ఆ రెండే బాగున్నాయి..

గాంధీ ఆస్పత్రిలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సూపరింటెండెంట్ పేషీ, కాన్ఫరెన్స్ హాల్ మాత్రమే బాగున్నాయని, మిగతా ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గాంధీ డ్రైనేజీ లీకేజీల పరిశీలనకు టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఇంజినీరింగ్ బృందం ద్వారా సమగ్ర నివేదిక తెప్పించుకుంటామని తెలిపారు. ఆపై సీఎంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయమై వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఇంజినీర్ల బృందం ఆస్పత్రిని సందర్శించి సూపరింటెండెంట్ రాజారావుతో భేటీ అయ్యారు. కాగా, ప్రతిపాదనలను సవరించి, మరోమారు టెండర్లు పిలిచేందుకు టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

నగరంలో నకిలీ కాస్మొటిక్స్ పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు మార్కెట్లలో భారీగా నకిలీ కాస్మొటిక్స్ చెలామణి అవుతున్నాయి. ఇదే స్థాయిలో డిటర్జెంట్స్ సైతం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీటికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు సేకరించిన పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. వీటిని తయారు, సరఫరా చేస్తున్న నిందితుల కోసం గాలించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ ఘరానా ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరు ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ ఉత్పత్తులు తయారు చేయడంతో పాటు ఆయా సంస్థలకు చెందిన ఉత్పాదనల్నీ కల్తీ చేస్తున్నట్లు గుర్తించారు. వీరి నుంచి భారీ స్థాయిలో కాస్మొటిక్స్, డిటర్జెంట్స్‌తో పాటు కాఫీ, టీ పొడులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బ్రూక్ బాండ్, రెడ్ లేబుల్, లైజాల్,హార్పిక్, సర్ఫ్ ఎక్సెల్ కంపెనీల పేర్లతో ఉన్నవి ఉన్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి శనివారం పోలీసులు వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: SHADNAGAR
O.S.NO.638 OF 2022

BETWEEN:
SMT PARVEEN BEGUM
And others ...PLAINTIFFS
AND
THE TAHSILDAR,
Kothur Mandal
And another ...DEFENDANTS
To
R-2 ALL CONCERNED

NOTICE

The Plaintiffs had filed the above suit for Declaration to declare the Plaintiffs as the absolute owner and possessor of Plot No.76, admeasuring 111 sq.yds in Sy.Nos.127/E2, 127/E, 127/AA3, 116/E, 127/AA3 and 123/A, situated at Electricity Employees Colony, Inmul Narva Village, Kothur Mandal, the then Mahaboobnagar District and now Ranga Reddy District and bounded on North: Plot No.75, South: Plot No.76/A, East: Plot No.77, West: 30 Feet Wide Road. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above Suit and the matter is posted to 28.02.2024 at 10:30 a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]

Sd/- N.VENKAN GOUD, Advocate
Plot No.133, Ananthula Janga Reddy Colony, Mamatha Nagar, GSI, L.B.Nagar, Ranga Reddy District.

బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

వ్యక్తి దుర్మరణం

శంకర్‌పల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపురం ఫ్లైఓవర్‌పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఏర్వగూడకి చెందిన కుసుమగళ్ల వెంకటేశ్(31) బైక్‌పై సంగారెడ్డి జిల్లా నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి వెళ్లి గురువారం రాత్రి తిరిగి వస్తుండగా ఫత్తేపురం ఫ్లైఓవర్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేశ్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినాయకరెడ్డి తెలిపారు.

మరో ఘటనలో..

యాచారం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు.. మండల పరిధిలోని తక్కళ్లపల్లికి చెందిన శ్రీశైలం(50) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇబ్రహీంపట్నంలో విధులు ముగించుకుని శ్రీశైలం శుక్రవారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా సాగర్ రోడ్డుపై క్రీడాక్షేత్రం వద్ద ముందు వెళ్తున్న లారీని అతడి బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ కుమార్ తెలిపారు.

నిరుపేదల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ శుక్రవారం శివకుమార్‌ను, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ 2.5లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఆర్థిక కష్టాలతో ఎంతోమందికి సకాలంలో వైద్యం అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలను అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.



శివకుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పేదల కష్టాలు తెలిసిన నాయకులు రేవంత్‌రెడ్డి వారికి అండగా ఉంటారని అన్నారు. నిరుపేదలను ఆదుకోవాలనే ఆలోచనతో సీఎం సహాయ నిధి నుంచి నిధులను మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటిరాజు, నాయకులు లింగం, రాజు, మాలిభాయ్, కె.లింగం, రంజిత్, వెంకటేష్, జగన్, లతీఫ్, బబ్లూ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలి

ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ పరీక్షలు విధిగా నిర్వహించాలని ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఆరోగ్య సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్‌సీడీ (సంక్రమించని వ్యాధులు) కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 30 ఏళ్లు నిండిన వారు జనాభాలో 52శాతం మంది ఉంటారని అన్నారు. వారికి విధిగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో వారి వివరాలను నమోదు చేయడంతో పాటుగా వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో వివరాలు ఏవిధంగా నమోదు చేయాలన్న అంశంపై ప్రొజెక్టర్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఎంఓ రాజశేఖర్, సౌజన్య, శ్రీలత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్

హామీలను పక్కాగా అమలుచేస్తాం



బోడంపహాడ్ గ్రామ కమిటీ సభ్యులతో పామెన జ్యోతి, నాయకులు

కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జ్యోతి

షాబాద్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని ఆ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏబ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మహిళా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షురాలుగా కారు సువర్ణ, ఉపాధ్యక్షురాలుగా మొగిలిగిద్ద వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి జ్యోతి, కార్యదర్శులుగా రావులపల్లి పార్వతమ్మ, సుమలత, సభ్యులుగా భాగ్యమ్మ, వెంకటమ్మ, యాదమ్మ, లక్ష్మమ్మ, చంద్రమ్మ, మాణెమ్మ, ఎలమ్మను ఎనుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతి భీంభరత్ మాట్లాడుతూ.. పేదలకు అవసరమై సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తారని అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు నర్సింములు చిన్నయ్య, రఫీక్, నవీన్, శివయ్య, రఘుపతిరెడ్డి, కృష్ణ, సురేశ్, సత్తయ్య తదితరులున్నారు.

'సాహితీ' ఆస్తుల గుర్తింపు షురూ..

- తెలుగు రాష్ట్రాల్లో సీసీఎస్ సోదాలు
- సబ్-రిజిస్ట్రార్లకూ లేఖలు రాసిన సిట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో తెలుగు రాష్ట్రాలకు చెందిన 2,728 మంది నుంచి రూ.1,110 కోట్లు స్వాహా చేసిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కేసు దర్యాప్తులో వేగం పెరిగింది. హైదరాబాద్ నగర నేర పరిశోధన విభాగంలో (సీసీఎస్) ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ సంస్థతో పాటు అనుబంధ సంస్థల ఆస్తులనూ గుర్తిస్తోంది. బాధితులుగా మారిన వారికి సాధ్యమైనంత త్వరగా న్యాయం చేయడానికి వీటిని ఎటాచ్‌మెంట్ కోరుతూ ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నారు. సాహితీ సంస్థ నగరంలోని అమీన్‌పూర్, నానక్‌రామ్‌గూడ, మాదాపూర్, కొంపల్లి, బంజారాహిల్స్, నిజాంపేటలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 9 ప్రాజెక్టులు చేపట్టింది. నివాస, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నామని నమ్మించి, ప్రీ లాంచ్ ఆఫర్లు ప్రారంభించింది. టీఎస్-రెరా నిబంధనల ప్రకారం ఒక ప్రాజెక్టుకు సంబంధించి కస్టమర్ల నుంచి వసూలు చేసిన సొమ్మును ప్రత్యేకంగా తెరిచిన ఎస్క్రో ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆ ప్రాజెక్టు నిర్మాణం కోసం మాత్రమే వాడాలి. అయితే సదరు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీ నారాయణ వివిధ ప్రాజెక్టుల్లోకి మళ్లించడంతో పాటు సొంత అవసరాలకు వాడుకున్నాడు. నిర్దేశిత సమయానికి ఫ్లాట్స్ ఇవ్వలేని పక్షంలో సాలీనా 15 నుంచి 18 శాతం వడ్డీతో డబ్బు తిరిగి ఇస్తానంటూ నమ్మబలికిన అతను పెట్టుబడిని డిపాజిట్లుగానూ మార్చాడు. ఈ గడువు తీరిన కొందరికి లక్ష్మీనారాయణ చెక్కులు కూడా ఇచ్చినా అవి బౌన్స్ అయ్యాయి. దీంతో రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన కేసులు సీసీఎస్‌కు బదిలీ కావడంతో 2022 డిసెంబర్‌లో లక్ష్మీనారాయణ అరెస్టయ్యారు. ఈ కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సైతం ఏర్పాటైంది. కేసు దర్యాప్తులో భాగంగా ఇది సాహితీ, దాని అనుబంధ సంస్థలతో పాటు యాజమాన్యం, వారి కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల పేర్లతో ఉన్న ఆస్తుల్ని గుర్తిస్తోంది. దీనికోసం సిట్ అధికారులు శుక్రవారం హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సాహితీ గ్రూప్ కంపెనీల్లో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకొని కార్యాలయాలను సీజ్ చేశారు. మరోపక్క ఈ సంస్థతో పాటు ఆయా వ్యక్తుల పేర్లతో ఉన్న ఆస్తుల వివరాలు తెలిపాల్సిందిగా రెండు రాష్ట్రాల్లోని సబ్-రిజిస్ట్రార్లకు లేఖలు రాశారు.

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడి

నిర్వాహకుల అరెస్టు

ఇబ్రహీంపట్నం: ఇంటిని అద్దెకు తీసుకొని మహిళలతో వ్యభిచారం చేయిస్తున్న నిందితులపై హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులు, ఆదిబట్ల పోలీసులు శుక్రవారం సంయుక్తంగా దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఓ మహిళ ఇంటిని అద్దెకు తీసుకుంది. డబ్బు ఆశ చూపి కొందరు మహిళలను తన ఇంటికి రప్పించి వ్యభిచారం నిర్వహిస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో నిర్వాహకులు జయశ్రీతో పాటు మహేశ్వరం ప్రాంతానికి చెందిన శ్రీధర్, రాంజీను పోలీసులు అరెస్టు చేశారు. బాధిత మహిళను హోంకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మీర్‌పేట పీఎస్ పరిధిలో..

మీర్‌పేట: వ్యభిచార గృహంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి ముగ్గురిని అరెస్ట్ చేసిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మీర్‌పేట ఉద్యోగ్‌నగర్‌లో నివాసముండే నిర్వాహకురాలు నోసిని సుజాత (35) తన ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం సాయంత్రం ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు జిల్లెలగూడకు చెందిన విటులు కాపాటి లక్ష్మీ నారాయణ (40), తుక్కుగూడ సర్దార్‌నగర్‌కు చెందిన తల్లా ప్రమోద్ (28)ను అదుపులోకి తీసుకుని మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. వీరివద్ద నుంచి రూ.17,080 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రేమను ఒప్పుకోలేదని..

- ఉరేసుకొని టీసీఎస్ ఉద్యోగి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం: ప్రేమ విఫలం కావడంతో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా వేములపల్లికి చెందిన సత్తినాగ చంద్రప్రకాశ్(24) హైదరాబాద్‌లోని ఆదిబట్ల ప్రాంతంలో 2021 నుంచి టీసీఎస్‌లో సిస్టమ్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ స్థానిక హాస్టల్‌లో ఉంటున్నాడు. తోటి మహిళా ఉద్యోగితో స్నేహంగా మెలిగేవాడు. ఈక్రమంలో ఆమెకు లవ్ ప్రపోజ్ చేశాడు. సదరు యువతి ఇందుకు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని హాస్టల్‌లో ఉండేవారు.. అతడి ఆఫీస్‌లో పనిచేసే బాబాకు తెలిపారు. బాబా ద్వారా అతని స్నేహితులు పవన్, ప్రవీణ్‌కు ఈ విషయం తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



చేవెళ్ల: భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో చేవెళ్ల మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జూలూరి పాండుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ శంకర్ యాదవ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్ పాండుగౌడ్, వీరేశం, పాషా, మురహరి, శంకరయ్య, క్రిష్ణ రెడ్డి, బీజేపీకి చెందిన ఉప సర్పంచ్ శంకర్ యాదవ్‌తో పాటు బి.దర్శన్, జంగయ్య, కుమార్, హుస్సేన్, వెంకటస్వామి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వారికి పామెన భీంభరత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్, మండల వర్కింగ్ ప్రెసిడెంటగ్ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక..

విద్యార్థి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం: కడుపునొప్పి భరించలేక ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలకి చెందిన బడేటి వంశీ(19) తుక్కుగూడలోని విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత రెండు సంవత్సరాలుగా నిత్యం కడుపునొప్పితో వంశీ ఇబ్బంది పడుతుండేవాడు. ఈ క్రమంలో కడుపునొప్పి వల్ల చదువుల్లో రాణించలేకపోతున్నానని మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వంశీ ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

AUCTION NOTICE

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT L.B.NAGAR
E.P.154/2016 IN A.A.206/2012

Between:
M/s.SHRIRAM TRANSPORT FINANCE COMPANY LIMITED ... DHr
And:
Sri. Venkateswara Transport Corporation and another ... JDr's

SALE OF IMMOVABLE PROPERTY

The General Public/ Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable property belonging to Judgment Debtor herein is ordered for Sale in an open court auction, the said auction is to be held on 06-03-2024 in the premises of II Additional District Judge Ranga Reddy District at L.B. Nagar at 10:30 A.m.

Therefore whoever is interest in purchasing the said property can attend and participate in the bid which is open to one and all personally or through an authorized agent.

Conditions of the Sale:

1.The upset price of the said property will be fixed by the Honorable II Additional District Judge, Ranga Reddy District at L.B.Nagar at the time of commencement of Auction.
2.The highest bidder shall be declared to the purchaser of the schedule mentioned property provided always that he is legally qualified to bid and provided that it shall be the discretion of the court or officer holding the sale to be decline acceptance of the highest bid when the price offered appears so clearly indicate as to make it advisable to do so.
3.The Successful bidder shall have to deposit poundage charges @ 3 % of the bid amount immediately after having been declared as the successful bidder in addition to the same, the successful bidder will also have to deposit 25 % of the bid amount on the same day. The poundage charges will be adjusted in the final bid amount.
4.In the event of default of payment of the poundage charges and the 25% of the bid amount, the deposit shall stand forfeited and the successful bidder shall be liable for such action to be taken by the Court as deemed fit and proper.
5.The balance bid amount shall be paid by the successful bidder within fifteen days from the bid falling which the bidder shall be liable for such action to be taken by the court as deemed fit and proper.

SCHEDULE OF THE PROPERTY

Schedules of Immovable Property belongs to 1st JDR Purchased Under Sale Deeds No.4518/2009 & 4519/2009 of SRO Maheshwaram.

SCHEDULE - A: Ranga Reddy District, Maheshwaram S.R.O. & Mandal, Nagireddipalle Village, Survey No.57/D, 58/F. Agricultural dry land out of an extent of 86 Guntas Agricultural Dry land bounded by
East : Agricultural Land of Sudhakar Reddy and Bhaskar Reddy **South:** Agricultural Land of Gollapally Bal Reddy and Srinivas Reddy **West** : Agricultural Land of Kesha Mallaiah and Medde Mohan Reddy **North** :Agricultural Land of Keshani Pentaiah

SCHEDULE - B :
Ranga Reddy District, Maheshwaram S.R.O. & Mandal, Nagireddipalle Village, Survey No.68/5, Agricultural dry land out of an extent of 71 Guntas Agricultural Dry Land bounded by
East :Agricultural Land of K.V.R. Projects Pvt.Ltd, **South:** Agricultural Land of Pentaiah **West** :Agricultural Land of Yadaiah and others **North** :Bata

// BY ORDER OF THE COURT//

Sd/-.Y.LAKNA REDDY, P.ANASUYA GOUD, RANGA NEHRU, ADVOCATES.